మౌలిక సదుపాయాల లేమితో ఇక్కట్లు

దశాబ్దాలుగా ఆ కాలనీల్లో అభివృద్ధి దూరం



చిట్టడవిల్లా మారిన కాలనీల్లో ఇళ్ల స్థలాలు

పెనుగొండ: పేద ప్రజల సొంతింటి కల నేరవేర్చాలన్న ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన కాలనీలు దుర్భర స్థితిలో ఉన్నాయి. చిట్టడవిలను తలపిస్తూ, మురికి కూపాలగా మారిపోతున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో నివసిస్తున్న పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. రోడ్లు నిర్మాణాలు లేకపోవడంతో కొన్ని కాలనీల్లో వారి సొంత ఖర్చులతో రహదారి వర్షపు నీటిలో మునగకుండా చిప్స్ వంటి మెటీరియల్‌తో ఎత్తు చేసుకొన్నారు. దీంతో డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు వాటి చెంతనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. పెనుగొండలో దొంగగూడెం, అడ్డపుంత, కోడిపందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాలనీల్లో గత రెండు దశాబ్దాలుగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అయితే ఏళ్లు గడిచిన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించలేకపోయారు. అడగడుగునా కాలనీలపై నిర్లక్ష్యం చూపడంతో ఆయా కాలనీ వాసులు నానావస్థలు పడుతున్నారు.

ఫలితం లేని నిర్మాణాలు

ఎప్పుడో ఏర్పడిన కోడి పందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాలనీల్లో ఇప్పటికీ సదుపాయాల కల్పన లేదు. ఇటీవల కోడిపందేల దిబ్బలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. ప్రణాళికాబద్ధంగా డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ఇళ్ల ముందు పేరుకు పోయిన మురుగుతో దుర్వాసన వెదజల్లుతుంది. దుర్వాసనలతో దోమల వృద్ధి చెందిన విషజ్వరాలకు దారి తీస్తుందంటూ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి దొంగగూడెం కాలనీలోనూ నెలకొంది. కాలనీ అంతా చిట్టడవిని తలపించే విధంగా గుబురుపొదలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో కాలనీ వాసులు బిక్కుబిక్కు మంటూ జీవనం గడుపుతున్నారు. పాముల బెడద పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఇదే పరిస్థితి అన్ని కాలనీల్లోనూ ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే చాలు ఇంటి నుంచి బయట అడుగు పెట్టే అవకాశం ఉండడంతో లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలనీల్లో ప్రజలను ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.



పెనుగొండలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు



దొంగగూడెం కాలనీలో ఇళ్ల ముందు నిలిచిపోయిన మురుగు నీరు

రోడ్ల నిండా ఆవులు.. దూడలు

నరసాపురం: పట్టణంలో రోడ్ల నిండా దూడలు, ఆవులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రధాన సెంటర్లలో పెద్ద సంఖ్యలో ఆవులు, దూడలు తిరుగుతున్నాయి. దీంతో వాహనదారులకు, బాటసారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. యజమానులు మార్కెట్ ప్రాంతంలో దూడలను వదిలేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. మరోవైపు పారిశుద్ధ్య ఇబ్బందులు కూడా కలుగుతున్నాయి. గతంలో దూడల యజమానులకు వాటిని కట్టడి చేసుకోవాలని, రోడ్లపైకి వదలకూడదని మునిసిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

30 నుంచి ఉచిత ఎంబ్రాయిడరీ శిక్షణ

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సంప్రదాయ ఎంబ్రాయిడరీ(మగ్గం వర్క్)పై రెండు నెలల ఉచిత శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ ఐవీ సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, యువతలు సృజనాత్మక నేపుణ్యాలు నేర్చుకొని ఉపాధి అవకాశాలు పొందడమే కాకుండా స్వయం ఉపాధి అవకాశాలు శిక్షణతో పొందవచ్చని పేర్కొన్నారు. శిక్షణలో నాణ్యమైన మగ్గం వర్క్ డిజైన్‌లు, ఆధునిక విధానాలు మార్కెట్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు నేర్పిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 30లోపు శిక్షణ పొందాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వా గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందిస్తామని వివరించారు. మిగిలిన వివరాలకు 95735 28272 63049 22617 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

క్లుప్తంగా

పుచ్చల్లంక విద్యార్థికి ఉత్తమ ర్యాంకు



దుర్గాభవాని

పెనుగొండ: పీజీ సెట్ ఫలితాల్లో ఆచంట మండలం పుచ్చల్లంకకు చెందిన పందే దుర్గా భవాని ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి 61వ ర్యాంకు సాధించింది. పూర్తి వ్యవసాయ కుటుంబానికి చెందిన దుర్గాభవానీ దీప్తి డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, కన్యమ్మ ఫౌండేషన్‌లో ఉచిత కోచింగ్ తీసుకొంది. ఉత్తమ ర్యాంకు సాధించిన దుర్గా భవానిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

మహిళకు వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

యలమంచిలి: జై భీమ్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా ప్రతి నెలా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ నెలకు సంబంధించి బుధవారం యలమంచిలిలంక గ్రామానికి చెందిన చిలకపాటి మహాలక్ష్మీకి వైద్యం నిమిత్తం రూ.20 వేలు అందించారు. మహాలక్ష్మీకి బ్రెయిన్ క్యాన్సర్‌తోపాటు, పక్షవాతం రావడంతో హైదరాబాద్ డాక్టర్ బసవతారకం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంది. ఆమెకు మాట, కాళ్లు పని చేయకపోవడంతో మంచం మీద నుంచి లేవలేని పరిస్థితిలో ఉన్నారు. ఆమె పరిస్థితి తెలుసుకుని జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు ఈ సహాయం అందించారు. కార్యక్రమంలో గెడ్డం సునీల్ గవాస్కర్, రాయపూడి భవాని ప్రసాద్, గెడ్డం సందీప్, కొంబత్తుల వెంకట్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారి ఎం.ఉమ

పాలకొల్లు సెంట్రల్: మహిళలు, బాలికలు పని చేసే ప్రాంతాల్లో తమకున్న భద్రతపై అవగాహన చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.ఉమ అన్నారు. బుధవారం పట్టణంలో వెలమగూడెం, బంగారు వారి చెరువుగట్టు అంగన్‌వాడీ కేంద్రా పరిధిలో పోక్సో యాక్ట్, పోష్ యాక్టుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ మహిళలు తమకున్న చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఎలా తప్పించుకోవాలో? తెలుసుకోవాలంటే చట్టాలపై అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిషోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీఎల్‌కే స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథునికి రుద్రాభిషేకాలు



పూజలు అందుకున్న శ్రీ గణనాథుడు

పెనుమంట్ర: సంకట చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జుత్తిగ శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వర స్వామి ఆలయ అవరణలో ఉన్న శ్రీ గణాధిపతికి బుధవారం ఉదయం క్షీరాభిషేకం, పంచామృతాలతో మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో స్వామి వారిని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



చిట్టవరం హైస్కూల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విద్యను బోధించే గురువులు అందరికీ ఆదర్శనీయులని నరసాపురం కో–ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు జక్కం బాబ్జి అన్నారు. బుధవారం నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ వశిష్ట రాయల్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు కోపల్లి శ్రీను, విస్సా మాణిక్యాలరావు, పైడికొండల కృష్ణ, గ్రంధి శ్రీను పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించాలి

ఆకివీడు: పట్టణంలో అర్ధ సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నుల్ని ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బకాయిలు, అర్ధ సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నులన్నింటినీ చెల్లించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలస్యంగా నాట్లు వేసిన రైతులకు అవగాహన



రైతులకు పలు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

పాలకొల్లు సెంట్రల్: ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఖరీఫ్ నాట్లు ఆలస్యంగా వేస్తుంటారని అలా ఆలస్యంగా వేయడం వల్ల వచ్చే సమస్యలపై కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోడూరు వ్యవసాయ అధికారి ఎం.విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం పోడూరు మండలంలోని వద్దిపర్రు గ్రామంలో ఆలస్యంగా నాట్లు వేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా ఈ నెల 7 వరకూ వరద నీరు ఉండడం వల్ల నాట్లు వేయడం ఆలస్యమైదని అన్నారు. అందువల్ల వ్యవసాయ శాఖ ప్రత్యేకంగా ఈ–పంట నమోదు చేసుకునేందుకు బుధవారం వరకూ అవకాశం కల్పించిందన్నారు. అదే విదంగా కోతలు ఆలస్యం అవుతాయి గనుక, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమయం కూడా తమ గ్రామానికి 2026 ఫిబ్రవరి 22 వరకూ గడువు పెంచాలని కోరామన్నారు.

రేపు ఎలుకల మందు పంపిణీ

పోడూరు మండలంలోని 16 గ్రామాల్లో సామూహిక ఎలుకలు నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల మందు (బ్రోమోడయోలిన్) పంపిణీ చేస్తామని విశ్వేశరరావు స్పష్టం చేశారు. రైతులందరూ విషపు ఎరను ఎలుకల నివారించేందుకు ఉపయోగించుకోవాలన్నారు. ఎలుకల మందు పెట్టే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌పైనే భారీ వాహనాల పార్కింగ్



216 జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన భారీ వాహనాలు

నరసాపురం: పట్టణంలో ఓఎన్జీసీ టెంపుల్‌ల్యాండ్ వద్ద జాతీయ రహదారి ఇక్కచిక్కపోయి కనిపిస్తోంది. 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో ప్రయాణీకులు ఇక్కట్లు పడుతున్నారు. జాతీయ రహదారి పక్కన రుస్తుంబాద ప్రాంతంలో ఓఎన్జీసీ టెంపుల్‌ల్యాండ్ కార్యాలయం ఉంది. ఓఎన్జీసీకి సంబంధించిన సరుకుల రవాణా భారీ వాహనాలతో ప్రతిరోజూ ఇక్కడికి సాగుతుంది. అయితే వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా జాతీయరహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పోలీసు శాఖ దృష్టి పెట్టి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగికి వాకర్స్ క్లబ్ ఆర్థిక సాయం



వెంకటరమణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పాలకొల్లు వాకర్స్ క్లబ్ పాలకవర్గ సభ్యులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మల్లుల వెంకటరమణ ఇటీవల పక్షవాతానికి గురవడంతో ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నాడు. కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కొంతమంది పాత్రికేయులు, మిత్రులు ద్వారా వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి రావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు సభ్యులతో కలిసి బుధవారం వెంకటరమణకు రూ.8 వేలు నగదును అందించారు. అవసరమైన మందులు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, మాఘం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుట్టు శిక్షణ శిబిరం



కుట్టిన మెటీరియల్స్‌తో విద్యార్థినులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థినులకు చదువుతో పాటు ఇతర వృత్తులపై అవగాహన ఉండడం ఎంతగానో దోహదపడుతుందని వసుధ ఫౌండేషన్ పట్టణ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు అన్నారు. బుధవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా బుద్దరాజు మాట్లాడుతూ కుట్టు మెషీన్లు, అల్లికలు నేర్చుకోవడం వల్ల విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. ఉచిత కుట్టు శిక్షణ తరగతులు తమ కళాశాలలో ఏర్పాటు చేయడంపై వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకటరామరాజుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, డాక్టర్ మణిమాల, విజయలక్ష్మి, జూలియా, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే తెలియజేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

పెనుమంట్ర: మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లమో కోర్సులు చేసే విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా తమకు తెలియపర్చవచ్చని వ్యవసాయ పరిశోధన సంస్థ సహసంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్స్ చేయడానికి కొత్తగా చేరే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వైస్ ప్రిన్సిపల్ నామల శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హాస్టల్లో ఉండే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలు, సమస్యలు ఎదురైపా ఈ వాట్సాప్ గ్రూప్ ద్వారా వైస్ ప్రిన్సిపాల్‌కు, వార్డెన్లకు నేరుగా సమాచారం ఇవ్వవచ్చునని, వారి స్థాయిలో ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తనకు కూడాడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉద్యోగ గ్యారెంటీతోపాటు భవిష్యత్ భద్రత కూడా ఉంటుందన్నారు. 51 మందిని చేర్చుకుని తమ కళాశాలలో ఇప్పటివరకు 33 మంది విద్యార్థులు బుధవారం నుంచి తరగతులకు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో బాలురు బాలికల హాస్టల్ వార్డెన్లు వై.సునీత, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణపతి నిమజ్జన ఊరేగింపు



తీన్‌మార్ డప్పులతో గోల్డ్ మార్కెట్ గణపతి నిమజ్జన ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులో గోల్డ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన గణపతిని పట్టణంలో ఊరేగించారు. బుధవారం వివిధ సన్నాయి వాయిద్యాలతో, తీన్‌మార్ డప్పులు, గరగల నృత్యాలతో గణపతి ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన కూడళ్లలో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జన కార్యక్రమం చేశారు. గ్రహణం కారణంగా స్వామివారి ఉత్సవాలు గ్రహణానికి ముందుగానే ముగించి బుధవారం ఊరేగింపు ఏర్పాటుచేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



సిద్ధాంతంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

భారీ అన్న సమారాధన

పెనుగొండ: గణపతి నవరాత్రులు ముగియడంతో భారీ అన్న సమారాధనలకు శ్రీకారం చుట్టారు. బుధవారం సిద్ధాంతంలో కాలవ వద్ద చలువ పందిరి వద్ద అత్యంత వైభవంగా నిర్వహించిన చవితి వేడుకల్లో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. విందు భోజనాలను మించి అన్న సమారాధన నిర్వహించడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా బారులు తీరారు. ఏర్పాట్లను కాలవకాడ కుర్రోళ్ల కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

తల్లీబిడ్డలకు పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులు, డాక్టర్లతో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందరాజు

పాలకొల్లు సెంట్రల్: తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరాజు మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా బరువు, ఇతర పరీక్షలు చేయించుకోవాలన్నారు. బిడ్డ ఎదుగుదలకు పోషకాహారం తీసుకోవడం ఎంతైనా అవసరమని అన్నారు. రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 35 మంది గర్భిణులకు పోషకాహారం కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పోతాబత్తుల సత్యనారాయణ, ట్రెజరర్ గన్నాబత్తుల శ్రీనివాస్, గుడాల హరిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో విశ్వనాథ జయంతి



ఏఎస్ఎన్ఎం కళాశాలలో విశ్వనాథ సత్యనారాయణ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తెలుగు సాహిత్యంలో అజరామంగా వెలుగొందిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఆదర్శనీయుడని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి కొనియాడారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ రామాయణ కల్పవృక్షం వంటి ఉత్తమోత్తమ సాహిత్యాన్ని అందించి తెలుగులో మొట్టమొదటి జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్న వ్యక్తి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు బూసి వెంకటస్వామి, డాక్టర్ యామిని, భద్రాచలం, డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి మహాప్రభో..!

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. అధిక జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు అధిక వేగంతో పాదచారులను ఢీకొడుతున్నారు. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణవాసులు కోరుతున్నారు.

14న ఉచిత మెగా వైద్య శిబిరం

భీమవరం: పట్టణంలో ఈనెల 14న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మెంటే వారి తోటలోని వండర్ కిడ్స్ స్కూల్ వద్ద ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం నిర్వహిస్తారని ఆయన స్పష్టం చేశారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నరసాపురం బ్రాంచి వారు [illegible] శ్రీ జక్కం చిన్నా తండ్రి వీరవెంకట సత్యనారాయణ [illegible] 919/2023 [illegible] ఆర్. యస్ నం.587/2 లో 108.1 చ.గ. [illegible]

పి.డి.యస్.వి.బాలాజీ బి.కాం.,బి.ఎల్.,
అడ్వకేటు, పాలకొల్లు, సెల్ : 94904 39792

ఘనంగా వడ్డాది పాపయ్య జయంతి



వడ్డాది పాపయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: రంగుల మాంత్రికుడు వడ్డాది పాపయ్య చిత్రాలు నేటికీ అజరామరం అని వపా బాపు ఆర్ట్ అకాడమి అధ్యక్షులు కొసనా భాస్కరరావు అన్నారు. బుధవారం పట్టణంలో వపా బాపు ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో వడ్డాది పాపయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కరరావు మాట్లాడుతూ చందమామ, యువ, స్వాతి, అభిసారిక వంటి వీక్లీ, మాసపత్రికలకు ఎన్నో ముఖ చిత్రాలు వేసి పాఠకులను మెప్పించారన్నారు. నేటికి ఆ చిత్రాలు ఎందరో చిత్రకారులకు ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల సత్యనారాయణ, జీఎస్ఎన్, చెల్లుబోయిన రాము, నక్కా వెంకటేశ్వరరావు, వాకలపూడి రవి, పీతాని శ్రీను, చలపాటి నాగేంద్ర, అధికారి పవన్, బొప్పే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలి

భీమవరం: భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ గంటా సుందర్‌కుమార్ తెలిపారు. భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలని ప్రకాశంచౌక్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్ష చేపట్టిన జవ్వాది సత్యనారాయణ, రాట్నాల శ్రీనివాస్‌కు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. భీమవరం ఏఎంసీలో కలెక్టరేట్ భవనాలు నిర్మించాలన్నారు. కలెక్టరేట్ మరోచోటికి తరలించేయత్నం మానుకోవాలని అన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్

90102 23729 (పాలకొల్లు)
81869 95956 (నరసాపురం)
90102 23729 (ఆచంట)

Office mail : tpgadvt@gmail.com